# కేసీఆర్ సహకారంతోనే ఇల్లెందు అభివృద్ధి

- పట్టణంలో 76 జీవోతో పేదలకు పట్టాలిచ్చాం
- 48,300 ఎకరాలకు పోడు పట్టాలిచ్చాం..
- తెలంగాణ కోసం కొట్లాడిన కేసీఆర్‌ను నమ్ముదామా..
- మోసకారి కాంగ్రెస్‌ను నమ్ముదామా..
- బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియా నాయక్

ఇల్లెందు, నవంబర్ 28: ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయ, సహకారాలతో ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీ ఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం ముగింపు కార్యక్రమంలో భాగంగా భారీ రోడ్డుషో నిర్వహించారు. జేకే కాలనీ నుంచి జగదాంబసెంటర్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ మీదుగా గోవింద్ సెంటర్ వరకు రోడ్డుషో కొనసాగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1814.40కోట్లతో గల్లీగల్లీకి సీసీ రోడ్లు, గ్రామాల మధ్య బీటీ రోడ్లు నిర్మించానన్నారు. రూ.1187.79కోట్లతో 1,77,345 మందికి సంక్షేమ పథకాలను అందించానని తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో రూ.315.10 కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏజెన్సీలోని 15,107 మంది గిరిజన,


మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పక్కన అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియా నాయక్

ఆదివాసీ బిడ్డలకు 48,300 ఎకరాలకు పోడు పట్టాలిచ్చిన కేసీఆర్‌ను నమ్ముదామా..? మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమని చెప్పే మోసకారి కాంగ్రెస్‌ను నమ్ముదామా..? ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా అనేక సంక్షేమ ఫలాలను అందించి ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కరోనా కష్ట సమయంలో మీతోనే, మీ మధ్యనే ఉన్నానని గుర్తు చేశారు.

**మోసగాళ్లకు బుద్ధి చెప్పాలి**

ఐదేండ్లు పార్టీ పదవులు అనుభవించి తీరా ఎన్నికల సమయంలో పార్టీ మారారని, వారు ఎందుకు పార్టీ మారారో ప్రజలందరూ ఆలోచించాలని కోరారు. మోసగాళ్లకు ఓటుతోనే బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.


రోడ్డు షోకు హాజరైన అశేష జనం

ఇప్పుడు జరుతున్న ఎన్నికలు కొనుగోళ్లకు, అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికలని తేల్చి చెప్పారు. పట్టణంలోని పేద ప్రజలకు 76 జీవో ద్వారా ఇండ్ల పట్టాలు ఇచ్చానన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లను అందిస్తామని, రైల్వే స్టేషన్ ఏర్పాటులో ఏ ఒక్క ఇంటికీ కూడా నష్టం జరగకుండా బైపాస్ రోడ్డు అవతలకు తరలిస్తామని చెప్పారు. ఇక్కడ పనిచేస్తున సింగరేణి కార్మికులను ఇక్కడే ఉండే విధంగా చూస్తానని తెలిపారు. తెలంగాణ కోసం కొట్లాడిన కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజల కష్టాలపై బాధ ఉంటుంది కానీ.. తెలంగాణ ప్రజలను 55 ఏండ్లు గోసపుచ్చిన కాంగ్రెస్‌కు బాధ ఎందుకు ఉంటుందని ఎమ్మెల్యే హరిప్రియ ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల పేరుతో మోసపూరిత ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో వాటిని ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకునేందుకు తప్ప మరొకటి కాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి మహిళకు రూ.3వేలు, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యం, కేసీఆర్ బీమా, రూ.400కే గ్యాస్ ఇస్తారని చెప్పారు. మీ ఆడ బిడ్డగా మీ మధ్యనే ఉంటూ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, గురువారం జరగబోయే ఎన్నికల్లో 5వ నంబర్‌పై ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత జగదాంబసెంటర్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దిండిగాల రాజేందర్, మడత వెంకట్‌గౌడ్, రమ నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, జానీపాషా, ఎస్ రంగనాథ్, జేకే శ్రీను, శీలం రమేశ్, మనోహర్ తివారి, బబ్లూ, పరుచూరి వెంకటేశ్వర్లు, మేకల శ్యాం, గిన్నారపు రాజేశ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**పట్టణంలో భారీ రోడ్ షో..**

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన భారీ రోడ్ షోలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణ నలుమూలల నుంచి జనం తరలి రావడంతో వీధులన్నీ కిక్కిరిసి పోయాయి. రోడ్‌షోలో కొలాటం, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేయడం ప్రజలను ఆకర్షించాయి.


గార్లలో ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## హరిప్రియా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

గార్ల, నవంబర్ 28 : ఈ నెల 30వ తేదీన నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని హరిప్రియా నాయక్ గెలుపు ఆకాంక్షిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన హరిప్రియానాయక్‌ను ఆశీర్వాదించి, మరోసారి గెలిపించాలని కోరారు. 24 గంటలు ప్రజా సేవ చేస్తున్నట్లు తెలిపారు. సీతంపేట, పెద్ద కిష్టాపురం, అంజనాపురం, గ్రామాల్లో వివిధ పార్టీలు నాయకులు బీఆర్ఎస్ చేరారు. ర్యాలీ అనంతరం మండలకేంద్రం కూడలిలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూడు శివాజీ చౌహాన్, ఎంపీటీసీలు రమేశ్ ,నాగమణి, మందనపు భాస్కర్ రావు, రైతు బంధు అధ్యక్షుడు పానుగంటి రాధాకృష్ణ, గాజుల గణేశ్, కత్తుల ప్రశాంత్, ఉత్తరయ్య, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

బయ్యారం, నవంబర్ 28 : బాలల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. మండల కేంద్రలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలలు తమ హక్కులను తాము సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో యువత, మహిళలపై రోజు రోజుకు అగాయిత్యాలు పెరుగుతున్నాయని అవేధన వ్యక్తం చేశారు. వాటిపై అప్రమత్తంగా ఉంటూ తిప్పికోట్టాలని తెలిపారు. అంతేకాకుండా తల్లి తండ్రుల ఆశలు వమ్ము చేయకుండా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ ఫోన్ నంబర్ 1098,181, 100,1930 సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మహిళల పరిరక్షణ కోసం కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా వంటి వాటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించి అధికారులు తెలపాలన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు, మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సంధ్యారాణి, రాకేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

## బయ్యారంలో ముమ్మర ప్రచారం..


ప్రచారం చేస్తున్న యువ నాయకులు

బయ్యారం , నవంబర్ 28: ప్రచారానికి చివరి రోజు కావడంతో మంగళవారం బయ్యారంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కర్యక్రమంలో నీలరపు సంపత్, కిర్తి ఉదయ్, గణేశ్, యాకయ్యా, నవీణ్,సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## 144 సెక్షన్ అమలు..

గార్ల, నవంబర్ 28 : ఈ నెల 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై బాణోత్ వెంకన్న తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్‌దే గెలుపు ఖాయం

**జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు**

బయ్యారం, నవంబర్ 28 : ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు స్పష్టం చేశారు. మండలంలోని లక్ష్మీపురం, కొత్తలక్ష్మీపురం, నర్సాపురం గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ మౌనికతో కలిసి ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముచ్చటగా మూడో సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాది ముభారక్, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, రైతు బంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్సోళ్ల మాయ మాటలు నమ్మొద్దని సూచించారు.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలందరికీ రూ. 400 గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికీ 5 లక్షల కేసీఆర్ బీమా, సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.3 వేలు, ఆరోగ్య రక్ష కింద రూ.15 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వర్తిస్తాయనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం లక్ష్మీపురం జీపీకి చెందిన 100 మంది న్యూడెమోక్రసీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షురాలు సుగుణ పాల్గొన్నారు.


కండువా కప్పి ఆహ్వానిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ బిందు

## అభివృద్ధి చేశా.. ఆశీర్వదించి గెలిపించండి

టేకులపల్లి, నవంబర్ 28: ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంలో ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని బీఆర్ఎస్‌ను ఆదరించి నన్ను ఆశీర్వదించి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధి హన్మతండా, దంతెలతండా, బోవోజితండా, రావులపాడు, గంగాపురం గ్రామాల్లో హరిప్రియ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు.ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను, ఇల్లెందులో నన్ను ఆశీర్వదించి కారు గుర్తుపై మీ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, బోడ బాలు నాయక్, బానోత్ రామ, బానోత్ కిషన్, చీమల సత్యనారాయణ, దళపతి శ్రీనివాసరాజు, నెల్లూరి రాంబాబు, చీమల రామకృష్ణ, భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ హ్యాట్రిక్.. హరిప్రియ డబుల్ ధమాకా**

ఇల్లెందు రూరల్, నవంబర్ 28: సార్వత్రిక ఎన్నికల్లో మళ్ళీ రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్‌తో పాటు ఇల్లెందులో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ డబుల్ ధమాకాతో గెలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య అన్నారు. మంగళవారం మండలంలోని హనుమంతులపాడు నుంచి ఇల్లెందు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక**

ఇల్లెందు రూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన 80 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి మంగళవారం చేరాయి. వీరికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు శీలం రమేశ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామమన్నారు.